సాక్షి
అనంతపురం
సోమవారం । 13 । అక్టోబర్ । 2025



టమాట కిలో రూ.18
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.18 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



ఉపాధి బిల్లుల్లో గోల్‌మాల్
ఉపాధి బిల్లుల్లో సిబ్బంది గోల్‌మాల్ చేస్తున్నారు. పనులు చేసిన వారికి మొండిచేయి చూపుతున్నారు. పచ్చ నేతల ఖాతాలకు నిధులు జమ చేస్తున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
34.9°/21.7°
జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం నుంచి నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

నేడు పరిష్కార వేదిక



అనంతపురం అర్బన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఓ.ఆనంద్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగనున్న కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. ఫోన్, ఆధార్ నంబర్లు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి సార్!


బాధితుడు ప్రభాకర్ రావు

అనంతపురం సెంట్రల్: 'న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే వారి ఎదుటే నాపై దాడి చేశారు. అయినా దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవడం లేదు' అని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు అనుచరుల దాడిలో గాయపడిన మరో బాధితుడు ప్రభాకర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి సార్ అంటూ వేడుకున్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము శ్రీనగర్‌కాలనీ సమీపంలోని ఎలైట్‌హోమ్‌లో నివసిస్తున్నామన్నారు. ఈనెల 10న అక్కడ ఉన్న తన స్నేహితుడి ఇంటికి వెళ్లామన్నారు. పక్కింట్లో నివాసముంటున్న ఓ బాలుడు క్రికెట్ బాల్ వేయమని కోరగా వేశానని, ఆ బంతి భువన చక్రవర్తి కారుకు తగలిందని చెబుతూ కొంతమంది తనపై చెప్పుతో దాడి చేశారన్నారు. న్యాయం కోసం పోలీసుస్టేషన్‌కు వెళ్తే మళ్లీ పోలీసుల సమక్షంలోనే తనపై చేయి చేసుకున్నారని వాపోయారు. ఏఆర్ కానిస్టేబుల్ హరి కుమార్‌ను కూడా కొట్టే ప్రయత్నం చేశారన్నారు. అన్నీ తెలిసిన మాలాంటి వారికే ప్రజాస్వామ్యంలో రక్షణ లేదంటే, ఇక సామాన్యులు ఎలా జీవనం సాగిస్తారని ప్రశ్నించారు. తాము తప్పు చేసి ఉంటే ఎలాంటి శిక్షకైనా సిద్ధమన్నారు. ఇప్పటికీ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అల్లుడు తేజ అనుచరులమని చెప్పుకుంటూ కొందరు తమ ఇంటి చుట్టూ తిరుగుతున్నారని, వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి గోల్ షూట్ విజేత 'అనంత'


ట్రోఫీ అందుకుంటున్న బాలికల జట్టు

కదిరి అర్బన్: చిత్తూరు జిల్లా నేరేబైలు గ్రామంలో ఈ నెల 11, 12వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి గోల్ షూట్ పోటీల బాలికల విభాగంలో ఉమ్మడి అనంతపురం జట్టు విజయం సాధించింది. అబ్బాయిల విభాగంలో రెండో స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఉమ్మడి జిల్లా గోల్‌షూట్ అసోసియేషన్ కార్యదర్శి ప్రసన్న కుమార్ ఆదివారం వెల్లడించారు.

గుత్తిలో టీడీపీ కార్యకర్తల గూండాగిరి


బాధిత దంపతులను విచారిస్తున్న పోలీసులు

గుత్తి: పట్టణంలో టీడీపీ కార్యకర్తలు గూండాగిరి ప్రదర్శించారు. దస్తగిరి, కుష్బూ అనే దంపతులపై అందరూ చూస్తుండగానే విచక్షణారహితంగా దాడి చేశారు. వివరాలు.. రెండు మాసాల క్రితం దస్తగిరి ఇంటిని టీడీపీ కార్యకర్తలు బలవంతంగా ఖాళీ చేయించారు. అంతే కాకుండా భార్యాభర్తపై దాడి చేశారు. ఈ ఘటనపై దస్తగిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో 21 మందిపై కేసు నమోదు చేశారు. తమపైనే కేసు పెడతారా అంటూ ఆదివారం రాత్రి స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న దస్తగిరి, కుష్బూ దంపతులపై షణ్ముఖ, శివ, పుల్లయ్యతో పాటు మరో ముగ్గురు దాడి చేశారు. విచక్షణారహితంగా కొట్టారు. స్థానికుల సమాచారంతో ఎస్‌ఐ సురేష్ సిబ్బందితో కలిసి బస్టాండ్‌కు చేరుకోగా.. అప్పటికే టీడీపీ కార్యకర్తలు అక్కడి నుంచి ఉడాయించారు. గాయపడిన దంపతులను పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి పంపారు. అనంతరం వారు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడానికి ప్రయత్నించగా.. పోలీసులు ఫిర్యాదు తీసుకోలేదు. పైగా వారినే గద్దించి స్టేషన్ నుంచి బయటకు పంపారు. ఈ విషయంపై ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని బాధితుడు దస్తగిరి చెప్పాడు.

దారుణం బాబూ!





ఎన్నికల ముందు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను అనేక హామీలతో ఊరించిన చంద్రబాబు.. అధికారంలోకి రాగానే ఆయా వర్గాలను దారుణంగా మోసం చేశారు. రాయితీ రుణాలు మంజూరు చేయకుండా 'అదిగో'.. ఇదిగో' అంటూ కాలం వెళ్లదీస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర కావొస్తున్నా రాయితీ రుణాలపై ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఆయా వర్గాల వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- ఆర్భాటపు ప్రకటనలే.. ఆదుకుంది లేదు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలను మభ్యపెడుతున్న చంద్రబాబు ప్రభుత్వం
- ఒక్కరికీ అందని రాయితీ రుణం
- సర్కారు తీరుపై దరఖాస్తుదారుల మండిపాటు

అనంతపురం రూరల్: అధికారంలోకి రాగానే సబ్సిడీ రుణాలు అందిస్తామని కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. సోలార్ ప్యానళ్లు, ఆటో, కారు, జనరిక్ మెడికల్ దుకాణాలు, ఫొటో, వీడియో స్టూడియో ఏర్పాటు కోసం రుణాలకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ క్రమంలో ఉమ్మడి అనంత పురం జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ కింద దాదాపు 10 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. బీసీ కార్పొరేషన్ కింద 1,472 యూనిట్లకు గాను 14,031 మంది ఈ ఏడాది జనవరిలోనే దరఖాస్తులు అందజేశారు. అప్పట్లో ఇంటర్వ్యూలు కూడా పూర్తి చేశారు.

ఆశ పెట్టి మోసం..

రాయితీ రుణాల ప్రక్రియపై ఇప్పటికీ అతీగతి లేకపోయింది. దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా లేకపోవడంతో దరఖాస్తుదారుల్లో నైరాశ్యం నెలకొంది. ఎప్పుడెప్పుడిస్తారా అంటూ కళ్లకు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్ కింద దరఖాస్తు చేసుకున్న వారి పరిస్థితి ఘోరంగా తయారైంది. కొన్ని రోజులుగా దరఖాస్తులు వెబ్‌సైట్‌లో కానరావడం లేదని, గడువు సైతం ముగిసిన నేపథ్యంలో దిక్కుతోచడం లేదని చెబుతున్నారు. అధికారులు దాటవేత ధోరణి అవలంబిస్తుండడంతో బాధ ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతున్నారు. ఆశ పెట్టి మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై వారంతా మండిపడుతున్నారు.

అప్పట్లో అడుగడుగునా అండ..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారు. ఆయా వర్గాల వారికి అన్ని విధాలా అండగా నిలిచారు. చంద్రబాబు ప్రభుత్వం మాత్రం ఆయా వర్గాలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తూ ఎన్నికల సమయంలో అనేక హామీలు గుప్పించడం, అధికారంలోకి రాగానే నిలువునా మోసం చేయడం పరిపాటిగా మార్చుకోవడం గమనార్హం.

నిలువునా మోసం చేశారు



కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ వర్గాలను నిలువునా మోసం చేసింది. ఎన్నికల్లో అనేక హామీలు గుప్పించి అధికారంలోకి రాగానే పూర్తిగా విస్మరించడం చంద్రబాబుకు పరిపాటిగా మారింది. జిల్లాలో చర్మశుద్ధి కేంద్రాలను తెరిపించి ఉద్యోగాలు కల్పిస్తామన్న కూటమి నాయకులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం అన్యాయం.
– సాకే హరి, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

ఎలాంటి సమాచారమూ లేదు



ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రాయితీ రుణం కోసం దరఖాస్తు చేసుకుని దాదాపు ఏడాదవుతోంది. ఇంత వరకు దీనిపై ఎలాంటి సమాచారమూ అందలేదు. దరఖాస్తులు సైతం వెబ్‌సైట్‌లో కానరాకపోవడంతో రుణాలు ఇస్తారా లేదో అర్థం కాని పరిస్థితి నెలకొంది.
– సుబ్బరత్నమ్మ, దరఖాస్తుదారు

ఆశ పెట్టి అన్యాయం చేస్తారా?



కూటమి ప్రభుత్వం రాయితీ రుణాలు అందిస్తామని చెబితే ఎంతో సంతోషించాం. దరఖాస్తులు చేసుకున్నాం. అయితే, ఇంత వరకు ఆ విషయంపై ఎలాంటి ప్రకటనలు చేయకపోవడం అన్యాయం. దరఖాస్తు చేసుకున్న వివరాలు సైతం ఆన్‌లైన్‌లో కానరాకపోవడంతో ఆందోళన తప్పడం లేదు.
– ఈశ్వరప్రసాద్, కళ్యాణదుర్గం

నిధులు మంజూరు కావాలి



సబ్సిడీ రుణాలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారమూ అందలేదు. నిధులు మంజూరైన వెంటనే రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటాం. దరఖాస్తు చేసుకున్న వారు కార్యాలయం దగ్గరకు రావాల్సిన అవసరం లేదు.
– కుముదా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

ఎంఎన్‌సీ సాకారమయ్యేనా?

- జీజీహెచ్‌కు రూ.1.02 కోట్ల యూనిట్ మంజూరు
- అనువైన స్థలం లేక ఏర్పాటులో ఆలస్యం
- రద్దవకముందే మేల్కోవాలంటున్న జిల్లా ప్రజానీకం

అనంతపురం కార్పొరేషన్: అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా తయారైంది ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పరిస్థితి. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే ఎంసీహెచ్ బ్లాక్ ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకోవడంతో గర్భిణులు, బాలింతలు, పసికందులకు పడకలు చాలక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే క్రమంలో ఈ ఏడాది జూన్‌లో మెటర్నల్ అండ్ న్యూ బార్న్ యూనిట్ (ఎంఎన్‌సీ) జీజీహెచ్‌కు మంజూరైనా.. ఆస్పత్రిలో అనువైన స్థలం లేక యూనిట్ ఏర్పాటులో ఆలస్యమవుతుండడంపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

జిల్లా యంత్రాంగమే స్పందించాలి!

సర్వజనాస్పత్రిలో గర్భిణులు ప్రసవించాక.. పసికందు అనారోగ్య సమస్యలతో ఉంటే ఎస్ఎన్‌సీయూలో ఉంచి చికిత్సలందిస్తున్నారు. బాలింతలను గైనిక్ విభాగంలో ఉంచుతున్నారు. ఈ క్రమంలో తమ బిడ్డ ఎలా ఉందోనని తల్లుల్లో ఒకవైపు ఆందోళన నెలకొంటుండగా.. మరోవైపు తల్లికి బిడ్డ దూరంగా ఉండడంతో త్వరగా కోలుకునేందుకు అవకాశం లేకుండా పోతోంది. ఈ క్రమంలోనే కేంద్ర ప్రభుత్వం 28 పడకలతో మెటర్నల్ అండ్ న్యూ బార్న్ యూనిట్‌ను మంజూరు చేయడం.. రూ.1.02 కోట్లు నిధులు కేటాయించడంతో కష్టాలు తప్పుతాయని అందరూ భావించారు. అయితే, ఆస్పత్రిలో గైనిక్ వార్డుకు అతి సమీపంలో యూనిట్‌ను 3000 చదరపు అడుగులతో ఏర్పాటు చేయాల్సి ఉన్నా వార్డు సమీపంలో అనువైన స్థలం లేకపోవడంతో ఆలస్యమవుతోంది. ఆస్పత్రి పై భాగంలో ఉన్న ఎస్ఎన్‌సీయూ సమీపంలో వార్డును ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసినా, బాలింతలు, పసికందులను పై అంతస్తులో ఏ విధంగా ఉంచుతారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. న్యూట్రీషియన్- రీహాబిలిటేషన్ సెంటర్, రేడియాలజీలోని కొన్ని విభాగాలను జతచేస్తే గ్రౌండ్ ఫ్లోర్‌లోనే యూనిట్ ఏర్పాటు చేసే అవకాశమున్నా అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకపోవడం గమనార్హం. నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోకుంటే ఎంఎన్‌సీ యూనిట్ రద్దయ్యే అవకాశం లేకపోలేదు. జిల్లా అధికార యంత్రాంగమైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అలా చేస్తే బాబుకు పుట్టగతులుండవ్

- ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాల్సిందే
- మాజీ మంత్రి శైలజానాథ్


వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శైలజానాథ్

బుక్కరాయసముద్రం: రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే చంద్రబాబుకు పుట్టగతులుండవని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి శైలజానాథ్ హెచ్చరించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం పార్టీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన బీకేఎస్ మండల పరిధిలోని దయ్యాలకుంటపల్లి, వెంకటాపురం గ్రామాల్లో రచ్చబండ, కోటి సంతకాల కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి శైలజానాథ్, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు ఎల్ ఎం మోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ చంద్రబాబు తన స్వార్థ ప్రయోజనాల కోసమే పనిచేస్తారంటూ మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు రాష్ట్రానికి 17 మెడికల్ కళాశాలలను తీసుకువచ్చారన్నారు. ఏనాడూ మెడికల్ కళాశాలల గురించి మాట్లాడని చంద్రబాబు నేడు జగనన్న తీసుకొచ్చిన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. పరిశీలకుడు ఎల్ఎం మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తామన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు నిలదీస్తూ ఉండాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోకుల్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు ముసలన్న, ప్రతాప్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు భాస్కర్, ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప, సర్పంచ్‌లు పార్వతి, రమేష్, పూల నారాయణస్వామి, కాటమయ్య, చికెన్ నారాయణస్వామి, వరికూటి కాటమయ్య, శివారెడ్డి, కుళ్లాయప్ప, పట్నం ఫణీంద్ర, బాలక్రిష్టారెడ్డి, అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రబీ అంచనా 1,07,503 హెక్టార్లు


విత్తనం కోసం ఎదురుచూపు..

అనంతపురం అగ్రికల్చర్: రబీలో 1,07,503 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు సాగులోకి రావొచ్చని అధికారులు అంచనా వేశారు. అందులో ప్రధాన పంట కింద పప్పుశనగ 65,017 హెక్టార్లు కాగా ఆ తర్వాత నీటి వసతి కింద వేరుశనగ 17,982 హెక్టార్లు, మొక్కజొన్న 7,888, వరి 6,069, జొన్న 4,919, ఉలవ 1,377, పొద్దుతిరుగుడు 1,230 హెక్టార్లలో సాగులోకి రావొచ్చని చెబుతున్నారు. అక్కడక్కడా గోధుమ, సజ్జ, రాగి, కొర్ర, పెసర, మినుము, అలసంద, నువ్వులు, కుసుమ, ఆముదం తదితర పంటలు కూడా సాగులోకి వస్తాయని అంచనా వేశారు. గతేడాది రబీ సాధారణ సాగు 1.18 లక్షల హెక్టార్లతో పోల్చితే ఈ ఏడాది 11 వేల హెక్టార్లు తగ్గవచ్చంటున్నారు.

80,950 మెట్రిక్ టన్నుల ఎరువులు..

ఈ రబీలో 80,950 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరమని ప్రణాళిక రూపొందించారు. అందులో యూరియా 25,990 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్‌లు 37,900 మెట్రిక్ టన్నులు, డీఏపీ 9,500 మెట్రిక్ టన్నులు, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ (ఎంవోపీ) 4,900 మెట్రిక్ టన్నులు, సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్ (ఎస్ఎస్‌పీ) 2,660 మెట్రిక్ టన్నుల ఎరువులు వివిధ కంపెనీల ద్వారా సరఫరా చేయించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే రబీ కింద 4 వేల మెట్రిక్ టన్నుల వరకు వచ్చాయన్నారు.

రబీ మొదలై 12 రోజులు కావొస్తున్నా ఇప్పటికీ రాయితీ కింద విత్తన పప్పుశనగ ఎప్పుడిస్తారో అర్థం కాక రైతులు విలవిల్లాడుతున్నారు. ధరలు, రాయితీలు, కేటాయింపులు ప్రకటించి నెల రోజులవుతున్నా విత్తన సేకరణే ప్రారంభించకపోవడంపై ఆందోళన చెందుతున్నారు. అసలే కేటాయింపులు 28 వేల నుంచి 14 వేల క్వింటాళ్లకు, రాయితీ కూడా 40 శాతం నుంచి 25 శాతానికి పరిమితం చేసి ఇబ్బందులోకి నెట్టిన కూటమి సర్కారు... కేటాయింపుల మేరకైనా ఎప్పుడిస్తారనే దానిపై స్పష్టత ఇవ్వకుండా కాలయాపన చేస్తుండడం గమనార్హం. నాలుగు రోజులుగా అక్కడక్కడా తేలికపాటి వర్షాలకే పప్పుశనగ సాగును రైతులు ప్రారంభించారు. చంద్రబాబు సర్కారుపై ఆశలు సన్నగిల్లిన కొందరు విధిలేని పరిస్థితుల్లో బళ్లారి, కర్నూలు జిల్లాల నుంచి విత్తనం తీసుకువస్తున్నట్లు తెలిసింది.

'చల్ల'గా పాగా వేసేశాడు


నగర పాలక సంస్థ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

- నగరం నడిబొడ్డున స్కావెంజర్ లైన్ స్థలం కబ్జా
- ఓ టీడీపీ నేత బరి తెగింపు

అనంతపురం క్రైం: ఆక్రమణలు వద్దు 'బాబో' అంటూ ప్రజలు మొత్తుకుంటున్నా 'చల్ల'గా ఆయన పాగా వేసేశాడు. ప్రజా అవసరాల కోసం వదిలిన స్థలంలో భవనం నిర్మించి వేలాది రూపాయల అద్దెకు ఇచ్చి జేబులు నింపుకుంటున్నాడు. కోర్టు రోడ్డులోని సూరి హోటల్ ఎదురుగా 7 అడుగుల వెడల్పు, 67 అడుగుల పొడవు మేర స్థలాన్ని ఓ టీడీపీ నేత ఆక్రమించాడు. ఇందులో హోటల్‌ను నడుపుకునేందుకు అద్దెకిచ్చాడు. తాజాగా ఆ స్థలంలో కొత్తగా నిర్మాణాలు చేపడుతున్నాడు. స్థలం కబ్జా చేయడమే కాకుండా పట్టపగలే యథేచ్ఛగా అక్కడ నిర్మాణాలు చేపడుతుండడంపై ఇటీవల పలువురు నగర పాలక సంస్థ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనరు బాలస్వామి ఆ స్థలాన్ని పరిశీలించి తక్షణం తొలగించుకోవాలని ఆదేశించారు. అధికారుల ఎదుట సరేనని తల ఊపిన కబ్జారాయుళ్లు వారు అటు వెళ్లగానే ఇటు పనులు తిరిగి ప్రారంభించడం గమనార్హం. దీనిపై మళ్లీ అధికారులకు పలువురు ఫిర్యాదు చేసినా అటువైపు కన్నెత్తి చూడకపోవడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. నగరంలో ఎక్కడైనా నాలుగడుగుల స్థలంలో తోపుడు బండి పెట్టుకుంటే వెంటనే అక్కడ వాలి తరిమేస్తున్న అధికారులు.. నగరం నడిబొడ్డున స్కావెంజర్ లైన్‌లో స్థలాన్ని ఓ టీడీపీ నేత ఆక్రమించినా పట్టించుకోకపోవడంపై నగరవాసులు మండిపడుతున్నారు. నగరపాలక సంస్థ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చేస్తాం... తేల్చేస్తామన్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ టీడీపీ నేత అక్రమ నిర్మాణానికి అండగా నిలుస్తున్నారని, దీంతోనే అధికారులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



నో'ట మాట' లేక

టమాట ధరలు ఎప్పుడెలా ఉంటాయో ఎవరికీ అర్థం కావడం లేదు. ఒక్కోసారి ధరలు ఆకాశాన్నంటి రైతులకు లాభాలు తెచ్చి పెట్టే ఈ పంట.. మరో సారి అథఃపాతాళానికి పడిపోయి కన్నీరు పెట్టిస్తోంది. ఎక్కడ పడితే అక్కడ పారబోసేలా చేస్తోంది. కొన్ని రోజులుగా మార్కెట్లో టమాట ధరలు పూర్తిగా పడి పోయాయి. ఒక్కో బాక్సు రూ.70 నుంచి రూ. 100 లోపే పలుకుతోంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టమాటలను మార్కెట్‌కు తీసుకువెళ్లే వాహనం ఖర్చులు కూడా మిగలకపోవడంతో దిక్కుతోచక రోడ్ల పక్కన పారబోస్తున్నారు. బ్రహ్మసముద్రం మండల పరిధిలోని పిల్లలపల్లి వద్ద ప్రధాన రహదారిపై కుప్పలు కుప్పలుగా టమాటలను పారబోసిన దృశ్యమిది. – బ్రహ్మసముద్రం:

పురుగు మందు పీల్చి ఉక్కిరిబిక్కిరి

- 9 మంది మహిళా వ్యవసాయ కూలీలకు అస్వస్థత


అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళా వ్యవసాయ కూలీలు

గుంతకల్లుటౌన్: మొక్కజొన్న పంటలో మొవ్వ తొలుచు పురుగులను నియంత్రించడానికి ఆకు సుడుల్లో క్రిమిసంహారక మందులను వేస్తున్న తొమ్మిది మంది మహిళా వ్యవసాయ కూలీలు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పురుగు మందు వాసన పీల్చడంతో దాని గాఢతకు విపరీతమైన చెమటలు పట్టి, వాంతులతో చేనులోనే కళ్లు తిరిగిపడిపోయారు. ఈ ఘటన ఆదివారం గుంతకల్లు మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ గుంతకల్లు సమీపంలోని ఐదు మోరీల వద్ద బాపట్ల జిల్లా ద్రోణాదులకు చెందిన కౌలురైతు సుబ్బరాయుడు 20 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేస్తున్నాడు. ఆదివారం ఉదయం రైతు పిలవడంతో మొక్కజొన్నలో పట్టిన పురుగు నివారణకు మందు చల్లడానికి ఒక్కొక్కరికీ రూ.280 చొప్పున కూలి మాట్లాడుకుని స్థానిక మహబూబ్‌నగర్ కాలనీకి చెందిన 19 మంది వ్యవసాయ కూలీలు ఒకే ఆటోలో కలిసి వెళ్లారు. కార్బొఫ్యూరాన్ 3 శాతం సీజీ అనే పురుగుమందు గుళికలను ఇసుకలో కలిపి ఆకుసుడుల్లో వేస్తుండగా.. మందు వాసన పీల్చడంతో వహీదాబేగం, మహాలక్ష్మి, వరలక్ష్మి, సుశీల, చంద్రకళ, శారదమ్మ, అశ్విని, రామాంజినమ్మ, నాగేశ్వరమ్మలకు విపరీతమైన చెమటలు పట్టి, వాంతులయ్యాయి. కళ్లు తిరిగి అక్కడే పడిపోయారు. కౌలురైతు, తోటికూలీలు వెంటనే వారిని ఆటోలో గుంతకల్లు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు, సిబ్బంది తక్షణ సేవలు అందించడంతో ప్రాణాపాయం తప్పింది. పురుగు మందు గాఢత నేరుగా ఊపిరితిత్తుల్లోకి చేరడం వల్లనే అస్వస్థతకు గురయ్యారని, ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగానే ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జయవర్ధన్‌రెడ్డి తెలిపారు. 24 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణ అవసరమని, తరువాత పరీక్షలు నిర్వహించి వారిని డిశ్చార్జ్ చేస్తామని ఆయన తెలిపారు. కాగా.. మిగిలిన పది మంది కూలీలకు ఎటువంటి ఇబ్బందులు లేకపోవడంతో వారు ఇళ్లకు వెళ్లిపోయారు.

కనీస జాగ్రత్తలు పాటించకపోవడమే కారణం

మొక్కజొన్నలో కత్తెర పురుగులను నియంత్రించడానికి వినియోగించే కార్బొఫ్యూరాన్ 3 శాతం సీజీ పురుగు మందు చాలా ప్రమాదకరమైనది. పురుగు మందు గుళికలను ఇసుకలో కలిపేటప్పుడు చేతులకు గ్లౌజులు, ముఖానికి మాస్క్ ధరించాలి. గాలి ఎదురుగా వచ్చినప్పుడు పురుగు మందు ముఖంపై పడుతుంది. అప్పుడు దానిని పీల్చడం వల్లనే అస్వస్థతకు గురవుతారు. ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నప్పుడు కూడా మందు పిచికారీ చేయొద్దు, చల్లొద్దని ఎన్నిసార్లు అవగాహన కల్పించినా చాలా మంది వినడం లేదు. – లీనా వసుంధర, మండల వ్యవసాయాధికారిణి, గుంతకల్లు

క్లుప్తంగా

మహిళా చట్టాల అమలులో ప్రభుత్వాలు విఫలం

- ఐద్వా అఖిల భారత కోశాధికారి పుణ్యవతి


మాట్లాడుతున్న పుణ్యవతి

అనంతపురం అర్బన్: మహిళా రక్షణ చట్టాల అమలులో ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని ఐద్వా అఖిల భారత కోశాధికారి పుణ్యవతి మండిపడ్డారు. ఫలితంగా దేశంలోను, రాష్ట్రంలోను మహిళలకు రక్షణ కరువైందన్నారు. బేటీ బచావో... బేటీ పడావో అని మాటల్లో చెబుతున్నా.. ఆచరణలో చూపించడం లేదని ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రభావతి, రమాదేవి, కోశాధికారి సావిత్రి, జిల్లా కార్యదర్శి చంద్రిక, నాయకురాలు నాగమణితో కలిసి విలేకరులతో పుణ్యవతి మాట్లాడారు. మహిళల సమస్యలపై సోమవారం నుంచి మూడు రోజుల పాటు అనంతపురం నగరంలో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభల్లో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రమాదేవి మాట్లాడుతూ.. ప్రతి మహిళకు ఆడబిడ్డనిధి కింద ప్రతి నెల రూ.1,500, వడ్డీ లేని రుణాలు రూ.10 లక్షలు వరకు ఇస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయలేదన్నారు. వీటిపై మహాసభల్లో చర్చిస్తామన్నారు. మహాసభల్లో భాగంగా సోమవారం నగరంలో ర్యాలీ, బహిరంగ సభ ఉంటుందన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

యల్లనూరు: మండలంలోని మల్లాగుండ్ల సమీపంలో చిత్రావతి నది ఒడ్డున పేకాట ఆడుతున్న పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. పేకాట ఆడుతున్న నాగోశేఖర్, సీతారామిరెడ్డి, శీనుతో పాటు 12 మందిని అరెస్ట్ చేసి, 11 ద్విచక్ర వాహనాలు, రూ.82,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

అనంతపురం సెంట్రల్: కర్ణాటక మద్యం తరలిస్తూ ఓ వ్యక్తి పట్టుబడ్డాడు. వివరాలను అనంతపురం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు సీఐ జయనాథ్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ ఆదివారం వెల్లడించారు. టాటా జెస్ట్ వాహనం నుంచి తెల్లటి సంచులను దింపుతుండగా అనుమానం వచ్చిన ఎక్సైజ్ పోలీసులు గమనించి, తనిఖీ చేశారు. అందులో 90 ఎంఎల్ సామర్థ్యం ఉన్న కర్ణాటక టెట్రా ప్యాకెట్ల మద్యం ఉన్నట్లుగా గుర్తించి వాహనంతో సహా స్వాధీనం చేసుకున్నారు. మద్యం దింపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో తన పేరు వెంకటపతి అని, లెనిన్‌నగర్‌లో నివాసముంటున్నట్లుగా వెల్లడించాడు. కర్ణాటకలోని బాగేపల్లి నివాసి కిషోర్ నుంచి తక్కువ ధరకే మద్యం కొనుగోలు చేసి అనంతపురంలో తన స్నేహితుడు నాగేంద్ర ద్వారా అధిక ధరకు విక్రయిస్తున్నట్లుగా అంగీకరించాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ఉపాధి బిల్లుల్లో గోల్‌మాల్!

- పనులు చేసిన వారికి మొండిచేయి
- పచ్చ నేతల అనుచరుల ఖాతాలకు నిధులు జమ
- 2014–19 నాటి బిల్లుల మంజూరులో అక్రమాలు


ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

కళ్యాణదుర్గం: ఉపాధి హామీ పథకం పనులు చేయించిన వారి మెటీరియల్ పేమెంట్ బిల్లుల చెల్లింపులో గోల్‌మాల్ జరిగింది. గత టీడీపీ హయాంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లుల విడుదలకు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరిన తర్వాత దృష్టి సారించింది. ఈ అవకాశాన్ని కంబదూరు మండలంలోని 'పచ్చ' నేతలు తమకు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. పనులు చేసిన వారికి మొండిచేయి చూపి.. తమ అనుచరులైన వారి ఖాతాలకు వేతనాలు మళ్లించి సొమ్ము చేసుకున్నారు. ఇందుకు ఉపాధి హామీ పథకంలో పని చేసే సిబ్బంది సహకారంతో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. 2014 – 2019 మధ్య కాలంలో అంటే టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు మండలంలో వివిధ శాఖల ద్వారా ఉపాధి హామీ పథకం నిధులతో 497 పనులు చేపట్టారు. 2019 నాటికి మెటీరియల్ పేమెంట్ కింద ఇవ్వాల్సిన బిల్లులు ఆగిపోయాయి. 2024 ఎన్నికల్లో చంద్రబాబు సారథ్యంలో టీడీపీ – జనసేన – బీజేపీ కూటమి ప్రభుత్వం వచ్చింది. ఏడాది పాలన తర్వాత ప్రభుత్వం పెండింగ్ ఉపాధి బిల్లుల విడుదలకు చర్యలు తీసుకుంది. ఇదే అదునుగా భావించిన టీడీపీ నేతలు వేతన బిల్లులపై కన్నేశారు. కొందరు ఉపాధి సిబ్బందితో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారు. ఆనాడు పనులు చేసిన వారిని కాకుండా.. తాము చెప్పిన వారి ఖాతాలకు మెటీరియల్ పేమెంట్ డబ్బులు పడేలా ప్రణాళిక రచించారు. ఈ క్రమంలోనే మండలంలో శాఖల వారీగా అప్పట్లో చేసిన 497 పనులకు సంబంధించి రూ.22.34 లక్షల బిల్లులను టీడీపీ నేతల అనుచరుల ఖాతాలకు జమ చేశారు.

ఉపాధి హామీ బిల్లుల విడుదల (శాఖల వారీగా..)

శాఖ	చేసిన పనులు	విడుదలైన నిధులు (రూ. లక్షల్లో)
వెలుగు	146	12.7
ఉపాధి హామీ పథకం	301	1.93
హౌసింగ్	18	3.9
పంచాయతీ రాజ్	6	2.15
వెటర్నరీ	26	1.66
మొత్తం	497	రూ.22.34 లక్షలు

తూతూ మంత్రంగా విజిలెన్స్ విచారణ..

కంబదూరు మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ నిధుల అక్రమాలపై రెండు రోజుల క్రితం అనంతపురం నుంచి డ్వామా విజిలెన్స్ అధికారి ఒకరు విచారణకు వచ్చారు. అయితే తూతూ మంత్రంగా విచారణ చేసి వెళ్లిపోయినట్లు తెలిసింది. అధికార పార్టీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి విచారణ 'మమ' అనిపించడం అనుమానాలకు తావిస్తోంది. క్షేత్రస్థాయిలో ఉపాధి నిధులు జమ అయిన అకౌంట్లను పరిశీలించి ఉంటే పూర్తిస్థాయిలో అక్రమాలు వెలుగులోకి వచ్చేవని పలువురు తెలిపారు.

క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి



మండలంలో ఉపాధి హామీ పథకం నిధులు పక్కదారి పట్టాయి. పని చేసిన వారికి కాకుండా పనిచేయని టీడీపీ నేతల అనుచరుల ఖాతాల్లోకి నిధులు మళ్లించారు. పనులతో సంబంధమే లేని వారి ఖాతాల్లోకి లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని జమ చేశారు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు టీడీపీ నేతలకు వత్తాసు పలుకుతూ అక్రమాలకు తెర లేపారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ జరపాలి.

– జి.హనుమంతరాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, కంబదూరు

ఇక్కడ పేకాడితే.. ఎలాంటి కేసులూ ఉండవు!

- కూడేరులో టీడీపీ నేతల కనుసన్నల్లో జోరుగా పేకాట
- తమ కేంద్రంలో పేకాడితే పోలీసు కేసులుండవంటూ భరోసా

కూడేరు: మండలంలోని చోళసముద్రం గ్రామ పరిసరాల్లో పేకాట ఊపందుకుంది. స్థానిక టీడీపీ నేతలు కొందరు పోలీస్ స్టేషన్‌కు కేవలం 8 నుంచి పది కిలోమీటర్ల దూరంలోనే పేకాట శిబిరాలను నిర్వహిస్తూ ఇతర ప్రాంతాల నుంచి జూదరులను ఆకర్షిస్తున్నారు. తమ కేంద్రంలో పేకాడితే పోలీసుల నుంచి ఎలాంటి సమస్య ఉండదని, అంతా తామే చూసుకుంటామని భరోసా నివ్వడమే కాక సకల సౌకర్యాలు కల్పిస్తున్నారు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచే కాక జిల్లా కేంద్రం, పొరుగున ఉన్న కర్ణాటక నుంచి కూడా పెద్ద ఎత్తున కార్లు, ద్విచక్ర వాహనాల్లో జూదరులు వాలిపోతున్నారు. పోలీసుల అండతోనే మొన్నటి వరకూ స్థానిక టీడీపీ నేత అండతో చోళసముద్రం సర్పంచ్ ఇంట్లోనే ఆమె భర్త పేకాడిస్తూ వచ్చాడు. తర్వాత జూదరుల సంఖ్య పెరగడంతో తోటల్లో రాత్రి సమయాల్లోనూ లైట్లు వేసి మరీ జూదాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో ప్రత్యేకంగా గ్రామ శివారులో మనుషులను ఏర్పాటు చేసి వాహనాల్లో వస్తున్న పేకాటరాయుళ్లు సులువుగా శిబిరాల వద్దకు చేరుకునే సౌకర్యాలు కల్పించారు.

పేదలకు వైద్య విద్య దూరం

- మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరణ చేస్తే నష్టపోయేది మన పిల్లలే
- మాజీ ఎంపీ తలారి రంగయ్య


మాట్లాడుతున్న డాక్టర్ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో నష్టపోయేది మన పిల్లలేనని, పేదలకు ఉచిత వైద్యం, వైద్య విద్య అందకుండా కూటమి ప్రభుత్వం కుట్ర పన్నిందని మాజీ ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య ధ్వజమెత్తారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం కళ్యాణదుర్గంలో ఆదివారం జరిగింది. కార్యక్రమంలో తలారి రంగయ్య మాట్లాడుతూ.. పేదలకు వైద్య విద్యను సులభతరం చేసేందుకు గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 వైద్య కళాశాలలకు అనుమతి తీసుకువచ్చారన్నారు. వీటిలో 5 కళాశాలలను ప్రారంభించి, అడ్మిషన్లు చేపట్టి తరగతులూ సజావుగా సాగేలా చర్యలు తీసుకున్నారన్నారు. మిగిలిన 12 కళాశాలల నిర్మాణాలు పూర్తయి అందుబాటులోకి వచ్చి ఉంటే రాష్ట్రంలో ప్రతి జిల్లాలోనూ ఓ మెడికల్ కాలేజ్ ఏర్పాటై ఉండేదన్నారు. అయితే వీటి నిర్మాణాలు వద్దని కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ రాసి అడ్డుకోవడమే కాక, తాజాగా వాటిని ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. దీంతో పేద విద్యార్థులకు వైద్య విద్య అందే పరిస్థితి లేకుండా పోతోందన్నారు. కళాశాలలు ప్రైవేట్ పరమైతే వైద్య విద్య అత్యంత ఖరీదుతో కూడుకుంటుందని, ఫలితంగా వేరే చిన్న దేశాలకు వెళ్లి వైద్య విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే ఉన్నత చదువుల కోసమని విదేశాలకు వెళ్లిన మన పిల్లలు అనారోగ్యం బారిన పడటం, ఆక్సిడెంట్ల బారిన పడడం కారణంగా చాలా మంది చనిపోయారని గుర్తుచేశారు. ప్రభుత్వంతో డబ్బులు లేవంటూ సాకులు చెప్పడం సరికాదన్నారు. కూటమి కుట్రలను తిప్పికొట్టి ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటుకు కోటి సంతకాలతో కూడిన లేఖను గవర్నర్‌కు రాస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ పేరు, ఊరు, సెల్ నంబర్‌తో పాటు సంతకాలు చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, మున్సిపల్ విభాగం వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సుధీర్, రూరల్ మండలాల కన్వీనర్లు గోళ్ల సూరి, ఎంఎస్ రాయుడు, పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, జి.హనుమంతరాయుడు, కౌన్సిలర్లు తిరుమల వెంకటేశులు, గోపారం శ్రీనివాసులు, పరమేశ్వరప్ప, శెట్టూరు జెడ్పీటీసీ మంజునాథ్, దొడగట్ట నారాయణ, కిష్టప్ప, నియోజకవర్గ వివిధ విభాగాల అధ్యక్షులు నాగలక్ష్మి, తిప్పేస్వామి, లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు యర్రంపల్లి కృష్ణమూర్తి, రామాంజనేయులు, నాయకులు మురళి, రామిరెడ్డి, రాజు, మల్లికార్జున, పాతలింగ, చరణ్, షెక్షావలి, బిక్కిహరి, రాజు, చిరు, ప్రతాప్, మాజీ జెడ్పీటీసీ రాజగోపాల్, దొడగట్ట నాయకులు గోవిందప్ప, బసవరాజు, సూరి, తమ్మన్న, బుశప్ప, చిత్తయ్య, ఎర్రిస్వామి, సవారప్ప, రాజు, రవి, పాలన్న, గంగన్నతో పాటు అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీఎస్పీ కార్యాలయం ఎదుట..

దంపతుల ఆత్మహత్యాయత్నం


డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న దంపతులు

అనంతపురం సెంట్రల్: ఆర్థిక వ్యవహారాలతో విసుగు చెందిన దంపతులు అనంతపురం డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నం చేశారు. ఆదివారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. బాధితులు తెలిపిన మేరకు.. కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లికి చెందిన అశోక్ మూడేళ్ల క్రితం బెళుగుప్ప మండలం జీడిపల్లి గ్రామానికి చెందిన గాలి ఆంజనేయులు కుమార్తె గిరిజను పెళ్లి చేసుకున్నాడు. ఆంజనేయులకు ముగ్గురూ కుమార్తెలు కాగా, తన అవసరాల కోసం అల్లుడు అశోక్ వద్ద దాదాపు రూ. 18 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఏడాది క్రితం చోటు చేసుకున్న ప్రమాదంలో గాయపడి ఆంజనేయులు మృతి చెందాడు. వీరికి దాదాపు 30 ఎకరాల వరకూ స్థిరాస్తి ఉంది. దీంతో అశోక్ తాను రూ.3, రూ.4తో వడ్డీకి తెచ్చి నగదు సమకూర్చానని, ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని అత్త లక్ష్మీదేవిని కోరాడు. అదే సమయంలో తన వాటా కింద రావాల్సిన స్థిరాస్తిని పంచివ్వాలని గిరిజ కోరింది. అయితే అప్పు చెల్లించకపోగా వాటాగా ఇవాల్సిన స్థిరాస్తిని ఇచ్చేందుకూ లక్ష్మీదేవి అంగీకరించలేదు. ఈ విషయంగా పెద్ద మనుషులు పంచాయితీ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో చేసిన అప్పు తీర్చే మార్గం కానరాక అశోక్ తన భార్య గిరిజతో కలిసి ఆదివారం ఎస్పీ కార్యాలయం వద్దకు చేరుకున్నాడు. అక్కడే ఉన్న డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన దిగారు. వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేశారు. గమనించిన పోలీసులు వెంటనే అడ్డుకుని టూటౌన్ పీఎస్‌కు తరలించారు. తన వదినలైన వందన (బీసీ వెల్ఫేర్ జూనియర్ అసిస్టెంట్), కవిత (కూడేరు మండలం కదరంపల్లి అంగన్‌వాడీ వర్కర్), కంబదూరు చెందిన రామకృష్ణస్వామి అలియాస్ బంబంస్వామి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరో మార్గం లేదని బాధితుడు అశోక్ వాపోయాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీకాంత్‌యాదవ్ తెలిపారు.

కూలిన కల్వర్టు రక్షణ గోడ - ఇద్దరికి గాయాలు

- నాసిరకం పనులే కారణమన్న స్థానికులు


శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: స్థానిక టీ సర్కిల్ మీదుగా 20 అడుగులకు పైగా వెడల్పుతో వెళుతున్న కల్వర్టుకు ఇటీవల నిర్మించిన రక్షణ గోడ ఆదివారం సాయంత్రం ఉన్నఫళంగా కుప్పకూలింది. అవతలి వైపుగా ఉన్న దుకాణాలకు, కల్వర్టుకు మధ్యలో రక్షణ గోడను కట్టారు. గోడ పక్కనే తోపుడు బండ్లను పెట్టుకుని వ్యాపారాలతో కొందరు జీవనం సాగిస్తున్నారు. గోడ కుప్పకూలుతుండగా గమనించిన స్థానికులు సాహసం చేసి కూరగాయల వ్యాపారి గోవిందమ్మ, అరటి పండ్ల వ్యాపారి కావేలమ్మను పక్కకు లాగారు. అప్పటికే గోడ కూలడంతో ఇద్దరూ గాయపడ్డారు. కూరగాయల బండితో పాటు ఓ ద్విచక్ర వాహనం శిథిలాల కింద చిక్కుకుని నుజ్జునుజ్జయ్యాయి. అరటి పండ్లు నేలపాలయ్యాయి. స్థానికులు అప్రమత్తం కాకుంటే ప్రాణాలకే ప్రమాదం ఉండేదని పలువురు వాపోయారు. క్షతగాత్రులను వెంటనే ఆటోలో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నాసిరకం పనులే కారణం..

కల్వర్టు పనులు చేపట్టిన టీడీపీకి చెందిన ఓ కాంట్రాక్టర్ నాసిరకం పనులు సాగించారని, దీంతో గోడ కుప్పకూలిందంటూ పలువురు స్థానికులు ఆరోపించారు. ఆదివారం ఉదయం కూడా కల్వర్టు కింద పనులు చేశారని తెలిపారు. నీరు ఎక్కువగా ఉన్నా స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అండ చూసుకుని కాంట్రాక్టర్ పనులు పూర్తి చేశారన్నారు. ప్రాణాలు పోయి ఉంటే తమ కుటుంబాల పరిస్థితి ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు. దీనికి ఎమ్మెల్యేనే పూర్తి బాధ్యత వహించి, బాధితులను ఆదుకోవాలని కోరారు. కాగా, విషయం తెలుసుకున్న సదరు కాంట్రాక్టర్, టీడీపీ నేతలు ఆగమేఘాలపై అక్కడకు చేరుకుని జేసీబీ సాయంతో శిథిలాలను తొలగించారు.

మద్యం మత్తులో బైక్‌పై నుంచి పడి...

- వ్యక్తి దుర్మరణం

గుంతకల్లు రూరల్: మద్యం మత్తులో ఓ యువకుడు ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్నూలు జిల్లా చిప్పగిరి మండలం నంచర్ల గ్రామానికి చెందిన పార్వతమ్మ, పరమేష్ దంపతుల కుమారుడు శివకుమార్ (35)కు 11 సంవత్సరాల క్రితం పెళ్లైంది. ఓ కుమారుడు ఉన్నాడు. గుంతకల్లులోని కూరగాయల మార్కెట్‌లో ఓ వ్యాపారి వద్ద కూలీగా పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలోనే మద్యానికి అలవాటు పడ్డాడు. దీంతో మనస్పర్ధల కారణంగా కొన్నేళ్ల క్రితం దంపతులిద్దరూ విడిపోయారు. తనను అడిగేవారు లేకపోవడంతో సంపాదన మొత్తం తాగుడుకే ఖర్చు పెడుతూ రోజంతా మద్యం మత్తులోనే ఉండేవాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి పని ముగించుకున్న అనంతరం మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరిన శివకుమార్.. చెన్నప్ప కొట్టాల రోడ్డులో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడిపోయాడు. ఆదివారం ఉదయం పొలం పనులకు వెళుతున్న రైతులు రోడ్డుపై పడి ఉన్న ద్విచక్ర వాహనాన్ని గుర్తించి, చుట్టుపక్కల గాలించగా గుంతలో శివకుమార్ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న కసాపురం పీఎస్ ఎస్ఐ వెంకటస్వామి అక్కడకు చేరుకుని పరిశీలించి, మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ప్రకృతి స్వర్గం.. ఆధ్యాత్మిక ధామం

చుట్టూ ఎత్తైన కొండలు.. వినసొంపైన పక్షుల కిలకిలరావాలు... ఆకట్టుకునే పచ్చదనం... సెలయేళ్ల సవ్వడి.. వాటి మధ్యన శేషతల్పంపై పవళింపు సేవలో దర్శనమిస్తున్న ఆలూరు రంగనాయకులస్వామి. మనస్సుకు ప్రశాంతతను అందించే ప్రకృతి అందాలతో స్వర్గాన్ని తలపిస్తోంది తాడిపత్రి మండలంలోని ఆలూరు కోన క్షేత్రం. ప్రముఖ ఆధ్యాత్మిక ధామంగా వెలుగొందుతున్న ఈ ప్రాంతం తాడిపత్రి నుంచి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పుణ్య క్షేత్రానికి తాడిపత్రి బస్టాండ్ నుంచి రోజూ బస్సు సర్వీసులు ఉన్నాయి. అంతేకాక ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం నిత్య అన్నదానం ఉంటుంది. బస చేసేందుకు వీలుగా అద్దె గదులూ ఉన్నాయి. మరి ఇంకెందుకు ఆలస్యం.. ఒక్కసారి ఆలూరు రంగనాథుడిని సందర్శించుకుని ప్రకృతి ఒడిలో సేదతీరుదాం రండి...

– తాడిపత్రి టౌన్:


ఆహ్లాదాన్నిగొలిపే సెలయేరు


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి, భూదేవి సమేత ఆలూరు రంగనాథస్వామి మూలవిరాట్


పచ్చని కొండల నడుమ ఆలూరు కోన రహదారి


ఆలూరు కోన జలపాతం

ప్రాణాలు బలిగొన్న ఈత సరదా


శివకుమార్ (ఫైల్)

బొమ్మనహాళ్: ఈత సరదా ఓ బాలుడిని బలిగొంది. బొమ్మనహాళ్ ఎస్‌హెచ్‌ఓ కమల్‌బాషా తెలిపిన మేరకు.. బొల్లనగుడ్డం గ్రామానికి చెందిన రుద్రన్న, బసమ్మ దంపతుల కుమారుడు శివకుమార్ (16).. గోవిందవాడ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. రెండవ శనివారం సెలవు కావడంతో తన స్నేహితులు ఆరుగురితో కలసి గ్రామ సమీపంలోని హగరి నదిలో ఉన్న కుంటలో ఈత కోసం వెళ్లాడు. అయితే శివకుమార్‌కు ఈత రాదు.. రెండు సార్లు మునిగిపోతుంగా స్నేహితులు వెలికి తీశారు. అయినా వినకుండా మూడో సారి కూడా నీటిలో దిగి గల్లంతయ్యాడు. సాయంత్రం వరకూ స్నేహితులు గాలించినా ఫలితం లేకపోయింది. విషయం పెద్దలకు తెలిస్తే తమను దండిస్తారనే భయంతో ఇంటికి చేరుకుని మిన్నకుండిపోయారు. రాత్రి అయిన శివకుమార్ ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. శనివారం అర్ధరాత్రి ఫిర్యాదు చేయడంతో గ్రామానికి చేరుకున్న పోలీసులు తొలుత స్నేహితులను గట్టిగా ప్రశ్నించారు. దీంతో అసలు విషయం వెలుగుచూసింది. వెంటనే గజ ఈతగాళ్లను రంగంలో దించి శివకుమార్ మృతదేహాన్ని వెలికి తీయించారు. ఆదివారం ఉదయం మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

చందనలో చోరీ

యాడికి: రెండు రోజుల క్రితం యాడికిలోని ఐదు ఇళ్లలో ఒకే రోజు చోటు చేసుకున్న చోరీలను మరువక ముందే మండలంలోని చందన గ్రామంలో మరో ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. చందన గ్రామంలో నివాసముంటున్న ఆనంద్.. తాడిపత్రి ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నాడు. వారం క్రితం ఆనంద్ భార్య సరోజ, కుమారుడు, కుమార్తెతో కలిసి కర్ణాటకలోని స్వగ్రామానికి వెళ్లింది. ఆనంద్ తమ్ముడు రమణయ్య కుటుంబ సభ్యులూ ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు రెండు రోజుల క్రితం నంద్యాలకు వెళ్లారు. దీంతో ఇంటి చుట్టుపక్కల ఎవరూ లేకపోవడం... ఆనంద్ ఇంటికి తాళం వేసి ఉండడం గమనించిన దుండగులు శనివారం రాత్రి ప్రహరీ దూకి తాళం బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించారు. విధులు ముగించుకుని శనివారం ఉదయం ఇంటికి చేరుకున్న ఆనంద్.. చోరీ విషయాన్ని గుర్తించి భార్యకు తెలపడంతో ఆదివారం ఉదయం ఆమె ఇంటికి చేరుకుంది. ట్రంకు పెట్టెలో ఉన్న 3 తులాల బంగారంతో పాటు 10 తులాల వెండి సామగ్రి, రూ.8 వేల నగదు అపహరించినట్లుగా నిర్ధారించుకుని ఫిర్యాదు చేయడంతో పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

జిల్లా వ్యాప్తంగా 748 మంది టీచర్లు నేడు విధుల్లోకి

అనంతపురం సిటీ: కొత్తగా ఉపాధ్యాయులుగా ఎంపికైన 748 మంది సోమవారం నుంచి విధులకు హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు నూతన ఉపాధ్యాయులకు విద్యా శాఖ అధికారులు జారీ చేశారు. కొత్తగా విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులందరికీ జిల్లా విద్యా శాఖాధికారి ప్రసాద్‌బాబు శుభాకాంక్షలు తెలిపారు. విధుల్లోకి చేరిన మొదటి రోజు నుంచే ఫేషియల్ యాప్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉంటుందని డీఈఓ సూచించారు.

పాత వారిని రిలీవ్ చేయండి..

కొత్తగా ఉపాధ్యాయ వృత్తిలోకి వచ్చిన వారు సోమవారం విధుల్లో చేరనున్న నేపథ్యంలో ఆ స్థానాల్లో ప్రస్తుతమున్న వారిని వెంటనే రిలీవ్ చేయాలని ఎంఈఓలను డీఈఓ ఆదేశించారు. గతంలో బదిలీ అయి, సబ్‌స్టిట్యూట్ లేని కారణంగా డిప్యుటేషన్‌పై పాత స్థానాల్లో కొనసాగుతున్న వారు వెంటనే రిలీవ్ అయ్యేలా చూడాలన్నారు.

'పెళ్లి పెటాకులు' కేసులో నిందితుడికి రిమాండ్

రాప్తాడురూరల్: పెళ్లి పెటాకులు చేసిన కేసులో నిందితుడు కటకటాలపాలయ్యాడు. అనంతపురం రూరల్ మండలం మన్నీల గ్రామానికి చెందిన ఓ యువతికి వివాహం నిశ్చయమైంది. శనివారం ముహూర్తం, ఆదివారం తలంబ్రాలు పెట్టుకున్నారు. ఇంతలో అదే గ్రామానికి చెందిన వివాహితుడు బాలచంద్ర అంతకు ముందురోజు వరుడుకి ఫోన్ చేసి వధువుతో తనకు వ్యక్తిగతంగా పరిచయం ఉందని, అందుకు సంబంధించిన ఫొటో కూడా పంపుతానని ఇద్దరు ఉన్న ఓ ఫొటోను మొబైల్‌కు పంపాడు. అలాంటి యువతిని పెళ్లి చేసుకుంటాన్నంటే నీ ఇష్టం అంటూ ఫోన్ పెట్టేశాడు. దీంతో ఆందోళనకు గురైన వరుడు, అతని కుటుంబ సభ్యులు పెళ్లిని రద్దు చేసుకున్నారు. బాలచంద్ర ఫోన్‌కాల్‌తోనే పెళ్లి చెడిపోయిందని, తనకు ఆయనకు ఏమాత్రం పరిచయం లేదని, కేవలం కక్ష కట్టి తన పెళ్లి చెడగొట్టాడంటూ బాధితురాలు ఇటుకలపల్లి పీఎస్‌లో చేసిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. రెండు రోజుల గాలింపు అనంతరం ఆదివారం బాలచంద్రను అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

3వ తరగతి విద్యార్థి అదృశ్యం

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కొడిమి దర్గా కొట్టాలుకు చెందిన 3వ తరగతి విద్యార్థి కనిపించడం లేదు. ఈ మేరకు అనంతపురం రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే...కొడిమి దర్గా కొట్టాలుకు చెందిన వేణు.. పాత సామాన్లు ఏరుకుంటూ వాటిని గుజరీకి వేయడం ద్వారా జీవనం సాగించేవాడు. ఈయనకు ముగ్గురు కుమారులు కాగా, పెద్ద కుమారుడు ఈశ్వర్ చదువుకోలేదు. రెండో కుమారుడు నరసింహ 6వ తరగతి, మూడో కుమారుడు రామాంజనేయులు 3వ తరగతి ఉరవకొండలోని హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. ఈ నెల 11న తమ్ముళ్లను ఉరవకొండకు వదిలేందుకు ఈశ్వర్ పిలుచుకెళ్తుండగా తాను ఇంటికివెళతానంటూ రామాంజనేయులు ఏడ్వడంతో రాచానపల్లి వద్ద బస్సులో నుంచి దించేసి వెళ్లారు. ఈశ్వర్ సాయంత్రం ఇంటికి చేరుకుని తల్లిదండ్రులకు విషయం తెలపడంతో కంగారుపడిన వారు రామాంజనేయులు కోసం గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం వేణు ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు అనంతపురం రూరల్ పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

పుస్తకాభిలాషను పెంచడమే లక్ష్యం



కేంద్ర గ్రంథాలయంలో వియ్ లవ్ రీడింగ్ కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు

అనంతపురం కల్చరల్: విద్యార్థులలో పుస్తకాభిలాషను పెంచి.. విజ్ఞాన సముపార్జన దిశగా ప్రోత్సహించడమే లక్ష్యమని గ్రంథాలయ అధికారులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 'వియ్ లవ్ రీడింగ్' కార్యక్రమం ఆసక్తికరంగా సాగింది. పెద్దసంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులకు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీరాములు, విశ్రాంత డీఎస్పీ హరి, డాక్టర్ అంకె రామలింగమయ్య తదితరులు జ్ఞాపకశక్తి పెంచుకోవడం ఎలా అనే అంశంపై పలు సూచనలు, సలహాలు అందించారు.పిల్లలతోనే కథలు చెప్పించడం, చదివించి, విశ్లేషణ చేయించడం గ్రంథాలయంలో కొనసాగిస్తామని గ్రంథాలయాధికారులు కమ్మన్న, గోవిందు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ సిబ్బంది ముత్యాలమ్మ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై పెద్ద గుంతలు



రైల్వే వంతెన సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంత

రాప్తాడు: గంగలకుంట సమీపంలోని రైల్వే వంతెన సమీపంలో 42వ జాతీయ రహదారిలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాహనాలు దగ్గరకు వచ్చే వరకు గుంతలు కనిపించవు. దీంతో ద్విచక్రవాహనాదారులు వేగంగా వచ్చి సడన్‌గా బ్రేక్ వేస్తుండడంతో కిందపడి గాయాలపాలవుతున్నారు. గత నెలలో దాదాపుగా 10 మంది ద్విచక్ర వాహనాల్లో కింద పడ్డారు. గుంతలు పూడ్చాలని ఆర్అండ్‌బీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరుకండి

రాప్తాడు: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అన్ని శాఖల మండలస్థాయి అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ విజయకుమారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు కార్యాలయంలో ఉండి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను తీసుకుని.. గడువులోపు సమస్యలను పరిష్కరించాలన్నారు. కొన్ని శాఖల అధికారులు హాజరు పట్టికలో సంతకాలు చేసి.. బయట తిరుగుతున్నారని, అలాంటి వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

కనకదాస విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కురుబలు

ఆత్మకూరు: సనపలో కురుబల ఆరాధ్య దైవం కనకదాస విగ్రహం ఏర్పాటుకు కురుబ కులస్తులు ఆదివారం భూమి పూజ చేశారు. గ్రామంలో కురుబలు అంతా ఐకమత్యంగా విగ్రహం ఏర్పాటుకు పూనుకున్నట్లు చెప్పారు.

సంతల ఆదాయం రూ.3.37 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఈ వారం జరిగిన పశువులు, జీవాల సంతల ద్వారా రూ.3.37 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు ఏడీఎం రాఘవేంద్రకుమార్ తెలిపారు. అందులో శనివారం జరిగిన గొర్రెలు, పొట్టేళ్ల సంత ద్వారా రూ.2,11,090 వసూలు కాగా ఆదివారం జరిగిన పశువులు, ఎద్దుల సంత నుంచి రూ.1,26 లక్షలు మేర వసూలైనట్లు తెలిపారు.

తపాలా పరీక్షకు విశేష స్పందన



పరీక్ష ప్రక్రియను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ అమర్‌నాథ్

అనంతపురం సిటీ: స్థానిక విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో స్థానిక తపాలా శాఖ అధికారులు ఆదివారం నిర్వహించిన దీన్ దయాళ్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్ పరీక్షకు విశేష స్పందన లభించింది. ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులు మొత్తం 348 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 281 మంది హాజరయ్యారు. 67 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ప్రక్రియను తపాలా శాఖ సూపరింటెండెంట్ అమర్‌నాథ్ పరిశీలించారు. పరీక్షలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో దోపిడీ

- ఫైసా ఖర్చు లేకుండా ఏటా 5 వేల మంది వైద్యులయ్యే అవకాశాన్ని చిదిమేశారు
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు రూరల్: వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో రూ.వేల కోట్ల దోపిడీకి సీఎం చంద్రబాబు తెరలేపారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలంలో చేపట్టారు. ఈ సందర్భంగా నగర శివారులోని టీజీఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో ప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకొస్తే... నేడు వాటిని తన బినామీలకు కట్టబెట్టేందుకు సీఎం చంద్రబాబు సిద్ధమయ్యారని విమర్శించారు. పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశంతో దివంగత వైఎస్ రాజశేఖరెడ్డి ఆరోగ్యశ్రీ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో రెండు అడుగులు ముందుకేసి రూ. 25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. నాడు–నేడు ద్వారా ఆస్పత్రులను ఆధునీకరించారని, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారని, ప్రతి ఇంటికీ ఫ్యామిలీ వైద్యుడిని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. పేదల ఆరోగ్యం విషయంలో జగనన్న ప్రభుత్వం రూ. వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. ఈ క్రమంలోనే పేదలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు, వారి పిల్లలు ఉచితంగా వైద్యవిద్య అభ్యసించేలా దేశచరిత్రలో ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలకు అనుమతులు తెచ్చారన్నారు. ఇందులో జగనన్న హయాంలోనే 5 కళాశాలలను నిర్మించి అడ్మిషన్లు మొదలు పెట్టి తరగతులు మొదలయ్యేలా చర్యలు తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మిగిలిన 12 మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్లు వద్దంటూ కేంద్రానికి లేఖ చంద్రబాబు రాశారని, నిర్మాణాలు కూడా ఆపేయాలంటూ జీఓ ఇచ్చారన్నారు. తాజాగా వాటిని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నం ముమ్మరం చేశారని మండిపడ్డారు. కొత్తగా వచ్చిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు పూర్తయితే కనీసం లక్షమందికి ఉపాధి లభించేదన్నారు. పైసా ఖర్చు లేకుండా ఏటా 5 వేలమంది వైద్యులయ్యే అవకాశాన్ని చిదిమేశారన్నారు.

పాపంపేట బాధితులకు అండగా ఉంటా

పాపంపేట బాధితులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని విధాలుగా అండగా నిలిచానని ప్రకాష్‌రెడ్డి గుర్తు చేశారు. ఆ సమయంలో 50 ఏళ్ల క్రితం నిర్మించిన 20 ఇళ్లను కూల్చి వేసేందుకు పరిటాల సునీత చేయని ప్రయత్నమంటూ లేదన్నారు. అడుగడుగునా ఆ ప్రయత్నాలను అడ్డుకున్నానన్నారు. అధికారం చేపట్టిన తర్వాత కలెక్టర్‌తో తనకు అనుకూలంగా సునీత లేఖ రాయించి రాత్రికి రాత్రి ఇళ్లను కూల్చివేశారన్నారు. మళ్లీ తానే హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చానని, ఇప్పుడు మళ్లీ రాచూరి బంధువులతో పరిటాల సునీత బంధువులు జీపీఏ చేయించుకుని పాపంపేట పొలంలో ఎక్కడ ఖాళీ స్థలాలుంటే అక్కడ వాలిపోతున్నారన్నారు. పాపంపేట బాధితులకు అండగా నిలబడతానన్నారు. కబ్జాదారులు పాపంపేట వీధుల్లో కనిపించకుండా తరిమికొడదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాప్తాడు ఎంపీపీ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, పార్టీ మండల కన్వీనర్లు బండి పవన్, దుగుమర్రి గోవిందరెడ్డి, నాయకులు భోగే గోపాల్‌రెడ్డి, గంగుల సుధీర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, ఈశ్వరయ్య, అక్కంపల్లి మాధవరెడ్డి, ఆకుల మునిశంకరయ్య, వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్టిఫికెట్లు మంజూరు చేయాలి

రాప్తాడురూరల్: సదరం సర్టిఫికెట్లలో అప్పీలు చేసుకున్న దివ్యాంగులందరికీ పారదర్శకంగా తనిఖీలు చేసి సర్టిఫికెట్లు మంజూరు చేయాలని ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అనంతపురం రూరల్ మండలం ఉప్పరపల్లి పంచాయతీ సంత్ గురు రవి దాస్‌కాలనీలో సమితి సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సమితి ఉమ్మడి అనంతపురం జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత ఆగస్టులో 9,600 మందికి పింఛన్ల నిలుపుదల నోటీసులను జారీ చేశారన్నారు. వీరిలో చాలామంది అర్హత కలిగిన దివ్యాంగులు ఉన్నారన్నారు. అర్హులకు న్యాయం చేయాలంటూ దివ్యాంగుల సంఘాల ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ధర్నా చేశామన్నారు. స్పందించిన ప్రభుత్వం మరోసారి ఎంపీడీఓ, మునిసిపల్ ఆఫీసులకు అప్పీళ్లకు అవకాశం కల్పించిందన్నారు.9,600 మందిలో 8,690 మంది అప్పీళ్లకు వెళ్లారన్నారు. వీరందరికీ ఆస్పత్రుల్లో పునఃపరిశీలన చేస్తున్నారన్నారు. ఈ సారైనా అర్హత కలిగిన దివ్యాంగులకు ఎలాంటి పరిస్థితుల్లోనూ పింఛన్ తొలగించకూడదన్నారు. పారదర్శకంగా సదరం సర్టిఫికెట్లు అందజేయాలని, లేనిపక్షంలో మళ్లీ ఉద్యమబాట పడతామని హెచ్చరించారు. సమావేశంలో బధిరుల సంఘం జిల్లా అధ్యక్షుడు పక్కీరప్ప, గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల అధ్యక్షులు సర్వేష్, రామిరెడ్డి, ఈశ్వర్, వికలాంగుల సహాయకుడు సుధాకర్, ఈసీ మెంబర్లు నరేంద్ర, శ్రీనివాసులు, రాజు, శివన్న, షరీఫ్ పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందాం



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ కోగటం

అనంతపురం టవర్‌క్లాక్: ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను అడ్డుకుందామని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో హోంలోని పెన్షనర్స్ భవన్‌లో ప్రజా ఆరోగ్య వేదిక, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రైవేటీకరణ చేయాలని చూడడం దారుణమన్నారు. ఇప్పటికీ పేద పిల్లలు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు వచ్చినా, ఖర్చు భరించలేక ఇబ్బంది పడతారని, అటువంటిది ప్రైవేటీకరణ చేస్తే పూర్తిగా వైద్య విద్య వారికి దూరమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు ప్రైవేటు పరం చేసిన వాటిలో ఏవీ సక్రమంగా అమలు కాలేదన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ విషయమై కార్యాచరణకు అందరి సహకారం అవసరమన్నారు. గతంలో విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఎన్నో ఉద్యమాలు చేశామని, మరో సారి అదే రీతిలో ఉద్యమాలు చేద్దామని పిలుపునిచ్చారు. నారాయణ వంటి బడా బాబులకు మేలు చేయడం కోసమే పీపీపీ భజన చేస్తున్నారని విమర్శించారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతి సారీ ప్రజలకు నష్టం చేసే సంస్కరణలు తీసుకువస్తారని మండిపడ్డారు. ప్రైవేటీకరణను ఆపేందుకు ప్రతి ఒక్కరూ ఐక్యతతో ముందుకు కదలాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అర్బన్ ఇన్‌చార్జ్ దాదాగాంధీ, డాక్టర్ రాయల్ కొండయ్య, శ్రీనివాస రావు, రామిరెడ్డి, రాజమోహన్, నిరంజన్, నాయుడు, సత్యనారాయణ, డాక్టర్ ప్రసూన, గోవింద రాజులు, డాక్టర్ భాను కిరణ్, వెంకటేష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అది రెండు కుటుంబాల వివాదమే

- ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశాం
- విలేకరుల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

అనంతపురం సెంట్రల్: నగరంలో శ్రీనగర్‌కాలనీ సమీపంలోని ఎలైట్‌హోంలో ఏఆర్ కానిస్టేబుల్ హరినాథ్, భువన్ చక్రవర్తి కుటుంబాల మధ్య మనస్పర్థల కారణంగా గొడవ జరిగిందని, కానిస్టేబుల్ కుటుంబసభ్యులు పేర్కొన్న అంశాల్లో వాస్తవాలు లేవని అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్‌లో సీఐ జగదీష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు నెలల క్రితం కానిస్టేబుల్ హరినాథ్‌కుమార్ క్రికెట్ ఆడుకుంటూ బాల్‌ను భువన్ చక్రవర్తి కారుకు కొట్టాడని, అప్పట్లో దీనిపై గొడవ జరిగిందని తెలిపారు. తాజాగా శుక్రవారం కూడా కానిస్టేబుల్ హరినాథ్‌కుమార్, అతని స్నేహితుడు ప్రభాకర్‌రావు, ఒక బాలుడితో కలిసి క్రికెట్ ఆడుతుంటే భువన్ చక్రవర్తి భార్య కళ్యాణి అడ్డు చెప్పిందన్నారు. ఈ క్రమంలోనే కానిస్టేబుల్ భార్య సుజాత ఆమెతో గొడవ పడ్డారన్నారు. పోలీసులు శుక్రవారం ఇరు కుటుంబాలను మందలించారని, అయితే శనివారం మరోసారి గొడవ జరిగిందని తెలిపారు. దీనిపై ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే, వారి బంధువులకు ఇందులో ప్రమేయం లేదన్నారు. ఎక్కడైనా వారు ఉన్నట్లు సీసీ కెమెరాలు చూపిస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. కానిస్టేబుల్ హరినాథ్, ఆయన భార్య రాజకీయ నాయకులు పేర్లు చెప్పి, పోలీసులు కేసులు నమోదు చేయలేదనడం సరికాదన్నారు.

డీఎస్పీ వ్యాఖ్యలపై విమర్శలు..

అవాస్తవాలు ప్రచురిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీనివాసరావు మీడియాను హెచ్చరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయలేదని కానిస్టేబుల్ చెప్పినట్లు రాయడం తప్పని ఆయన అనగా.. శుక్రవారం దాడులు చేసుకుంటే ఎప్పుడు కేసులు నమోదు చేశారని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. బాధితులు పేర్కొన్న అంశాలనే మీడియా ప్రస్తావించిందని,పోలీసులు ఏం జరిగిందో వివరణ ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. దీనిపై డీఎస్పీ మాట్లాడుతూ తొలుత ఇరువర్గాలకు నచ్చజెప్పామని, శనివారం కేసులు నమోదు చేయడానికి తీవ్ర ఆలస్యమైందని, రాత్రి 10 గంటల తర్వాత ఇరు వర్గాలపై కేసు నమోదు చేశామన్నారు. పోలీసు స్టేషన్‌లోనే కానిస్టేబుల్ కుటుంబంపై దాడి జరిగిందా అని ప్రశ్నిస్తే సీసీ కెమెరాలు పరిశీలించే అధికారాలు తమకు లేవని, ఉన్నతాధికారుల అనుమతి తీసుకొని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

పేదల గొంతుక ఐదుకల్లు సదాశివన్



ఐదుకల్లు సదాశివన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం అర్బన్: పేదల సమస్యలను పాలక వర్గాల దృష్టికి తీసుకెళ్లేందుకు వాళ్ల గొంతుకై పనిచేసిన కమ్యూనిస్టు నేత ఐదుకల్లు సదాశివన్ నేటి యువతకు ఆదర్శమని సీపీఐ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఐదుకల్లు సదాశివన్ 37వ వర్ధంతి నిర్వహించారు. నగర కార్యదర్శి శ్రీరాములు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జాఫర్, జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి మాట్లాడారు. వీకే ఆదినారాయణరెడ్డి, నీలం రాజశేఖర్‌రెడ్డి, తరిమెల నాగిరెడ్డి, గుత్తి రామకృష్ణ తదితరుల సమకాలికునిగా పేదవారి పక్షాన పోరాటాలు చేసిన యోధుడు ఐదుకల్లు సదాశివన్ అన్నారు. భూస్వాముల ఆధీనంలో ఉన్న మిగులు భూములు పేదలకు దక్కేందుకు పోరాటాలు చేశారన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర పాలకుల ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లిందన్నారు. సదాశివన్ ఆశయాలతో ప్రతి నాయకుడు, కార్యకర్త పోరాటం సాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు మల్లికార్జున, రాజారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యుడు కేశవరెడ్డి, వీకే ట్రస్ట్ అధ్యక్షుడు వీకే రంగారెడ్డి, న్యాయవాది వేణుగోపాల్, డాక్టర్ చెన్నకేశవులు, నాయకులు లింగమయ్య, రమణయ్య, రాజేష్‌గౌడ్, జాన్సన్‌బాబు, సంతోష్‌కుమార్, అల్లీపీరా, కృష్ణుడు, కుళ్లాయి స్వామి, భాగ్యమ్మ, జయలక్ష్మి, వరలక్ష్మి, యశోదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

స్మృతి నీరాజనం



చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన



మాట్లాడుతున్న ప్రభుత్వ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్

- సంధ్యామూర్తి కుమారుడు నందకుమార్‌కు ఘన నివాళి

అనంతపురం కల్చరల్: శాస్త్రీయ, జానపద నృత్యాలు, బుర్రకథ కళారూపంతో చిన్నారులు స్మృతి నీరాజనాలర్పించారు. ఆదివారం నగర శివార్లలోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఇటీవల మరణించిన నాట్యాచార్యులు సంధ్యామూర్తి కుమారుడు నందకుమార్ స్మారకోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన సంధ్యామూర్తి శిష్యబృందాలు, వివిధ కళాసంస్థల కళాకారులు అద్భుత ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. స్మారక సమావేశంలో ప్రభుత్వ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్, సినీనటుడు రమేష్‌నీల్, బ్రాహ్మణ సంఘం నాయకులు శ్రీనిధి రఘు, సాయిట్రస్టు విజయ్‌కుమార్, నాగిన్‌ప్రసాద్, వలీస్వామి ఆశ్రమ ప్రతినిధి విజయ్ కుమార్ తదితరులు మాట్లాడారు. జిల్లాకు ఎనలేని పేరుప్రఖ్యాతులు తెచ్చిపెట్టిన శ్రీనృత్యకళానిలయం కళాసేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. నాట్యాచార్యులు సంధ్యామూర్తి ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ బాలాకుమారి, అనురాధ, ఆషిష్, శశికళ, రామకృష్ణ సేవా సమితి శ్రీధరమూర్తి, సంగీత విద్వాంసులు నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం



రాప్తాడులో నీలకంఠేశ్వర స్వామి కాలనీలో ముందుకు కదలని మురుగు నీరు



రాప్తాడులో వైన్ షాపు దగ్గర పూడుకుపోయిన కాలువ

- ముందుకు పారని మురుగు
- దోమల మోతతో వ్యాధుల విజృంభణ
- పట్టనట్టు వ్యవహరిస్తున్న పంచాయతీ అధికారులు

రాప్తాడు: మేజర్ పంచాయతీ రాప్తాడులో డ్రైయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. 2,500 నివాసాలు, పది వేలకు పైగా జనాభా కలిగిన పంచాయతీలో అరకొరగా ఉన్న డ్రైయినేజీల నిర్వహణను అధికారులు గాలికొదిలేశారు. ఇక అవసరమైన చోట్ల నిర్మాణాల ఊసే మరిచిపోయారు. పలు వీధుల్లో డ్రైయినేజీలు చెత్తాచెదారాలతో పూడిపోయి మురుగు ముందుకు కదలక కంపు కొడుతున్నాయి. మురుగు కాలువలు దోమలకు స్థావరాలుగా మారాయి. ప్రజలకు కంటి మీద నిద్ర లేకుండా చేస్తున్నాయి. మరోవైపు సీజనల్ వ్యాధులు దాడి చేస్తున్నాయి. దోమల నివారణ కోసం ఒక్కసారి కూడా ఫాగింగ్ చేపట్టిన దాఖలాలు లేవు. వ్యాధులు ప్రబలడానికి అపరిశుభ్రత, కలుషిత నీరే ప్రధాన కారణమని తెలుస్తోంది.

జ్వరాలబారిన పడుతున్నాం



ఇంటి పక్కనే పెద్ద డ్రైయినేజీ ఉంది. మురుగు నీరు ముందుకు కదలడం లేదు. దోమలు విపరీతంగా ఉన్నాయి. 15 ఏళ్లుగా సమస్య ఇలానే ఉంది. ప్రస్తుతం మా ఇంట్లో అందరికీ జ్వరాలు వస్తున్నాయి. ఆస్పత్రుల చుట్టూతిరుగుతున్నాం. ఆదాయమంతా వైద్య ఖర్చులకే సరిపోతోంది. అధికారులు స్పందించాలి.

–లక్ష్మీ, రాప్తాడు


దోమల దాడి ఎక్కువ



మేము నివాసముంటున్న ప్రాంతంలో డ్రైయినేజీ లేదు. నిర్మించాలని అధికారులను కోరుతున్నా పట్టించుకోలేదు. ఇంటి పక్కనే మురుగు నీరు నిలుస్తోంది. ఆ మురుగు నీటిలో దోమలు వృద్ధి చెందడంతో రోగాల బారిన పడుతున్నాం. సాయంత్రం 6 గంటలు దాటితో దోమల దాడి చేస్తాయి. దోమల మోత తట్టుకోలేక పోతున్నాం. ఇలాంటి నరకం పగవారికి కూడా రాకూడదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు నీటి సమస్యను పరిష్కరించాలి.

–నందిని, రాప్తాడు

సుబ్బరాయసాగర్‌లో 7.7 మీటర్లకు చేరిన నీటిమట్టం



సుబ్బరాయసాగర్‌కు చేరిన నీరు

పుట్లూరు: మండలంలోని సంజీవపురం సమీపంలో ఉన్న సుబ్బరాయసాగర్‌కు పది రోజులుగా నీరు చేరుతోంది. వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో హెచ్చెల్సీ ద్వారా చెరువులను నింపితే మినహా గ్రామాల్లో తాగునీటి ఎద్దడికి పరిష్కారం లభించే అవకాశం లేదు. అయితే సుబ్బరాయసాగర్‌కు ఇన్‌ఫ్లో వంద క్యూసెక్కులు మాత్రమే ఉండటంతో ఇప్పటికీ నీటి మట్టం 7.7 మీటర్లకు మాత్రమే చేరుకుంది. అయితే సాగర్ గేట్లను మరమ్మతు చేయడంతో నీరు లీకేజీ అయ్యి వృథాగా పోయింది. సాగర్‌లో 12 మీటర్లకు పైగా నీటి మట్టం చేరుకున్న అనంతరం విడుదల చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఇలాంటి సమయంలో సుబ్బరాయసాగర్‌కు ఇన్‌ఫ్లో పెరిగేలా చర్యలు తీసుకుని, పూర్తి స్థాయిలో నీరు సరఫరా చేసి, తాగునీటి ఎద్దడి నివారణకు చెరువులను నింపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలతో పాటు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పట్టు వస్త్రాలతో పాటు బంగారు ఆభరణాలు అలంకరించి పూజలు చేశారు. స్వామి వారి స్వర్ణ ముఖ కవచాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేయించారు. ఆలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున కాల సర్పదోష నివారణ రాహుకేతు హోమాలను నిర్వహించారు. ఆలయంలోని మంజునాథ స్వామి వారికి, పార్వతి దేవికి అభిషేకాలు నిర్వహించి మహా మంగళహారతి అందించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వివరాల్లోకి వెళ్లితే... రాప్తాడుకు చెందిన అద్ర లక్ష్మన్న, నారాయణమ్మ దంపతులకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కొంత కాలం నుంచి లక్ష్మన్న, కుమారుడు నల్లప్ప ఆస్తి విషయంపై ఘర్షణ పడుతున్నారు. ఈ క్రమంలో కొంత ఆస్తిని లక్ష్మన్న కుమార్తెలకు రాసిచ్చినట్లు తెలుసుకున్న కుమారుడు తనకు తెలియకుండా వారికెలా ఆస్తి రాసిస్తావని గొడవ పడుతున్నాడు. పది రోజుల క్రితం నల్లప్ప తన తండ్రి ఉంటున్న ఇంటి దగ్గరకు వచ్చి ఆస్తి మొత్తం తన పేరు మీద రాసివ్వాలని ఒత్తిడి తెచ్చాడు. అదేరోజు లక్ష్మన్న తన కుమారుడిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నల్లప్ప కూడా తనకు వచ్చే ఆస్తిని కుమార్తెలకు రాసిచ్చాడని మరో కేసు పెట్టాడు. తనపైనే కేసు పెడతావా అంటూ మరుసటి రోజు లక్ష్మన్న కుమార్తెలతో కలిసి దాడి చేయడంతో నల్లప్ప అపస్మారకస్థితికి చేరుకున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొంది తర్వాత ఇంటికి వచ్చాడు. శనివారం నల్లప్ప గార్లదిన్నె మండలం ముకుందాపురంలో ఉన్న చీనీ తోటకు వెళ్లాడు. అక్కడే పడుకుని.. ఆదివారం ఉదయం గడ్డిమందు తాగాడు. మద్యాడులో తన భార్య జయమ్మ బంధువులకు ఫోన్‌చేసి గడ్డి మందు తాగానని, తన భార్య, కుమార్తె, కుమారుడిని బాగచూసుకోవాలని చెప్పి ఫోన్ కట్ చేశాడు. దీంతో వారు తోట దగ్గరికి వెళ్లి నల్లప్పను అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకువచ్చారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో అక్కడి నుంచి బెంగళూరు తరలించారు.

నేడు పెద్దమ్మ వార్షికోత్సవం



అలంకరణలో పెద్దమ్మ తల్లి

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని సచివాలయం వద్ద వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయంలో సోమవారం ఏడో వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి బోనాల పండుగ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అమ్మవారి ఆలయాన్ని ప్రజలు వివిధ పూలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారి ఆలయం ఎదుట అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

'కోటంక'లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.